సాక్షి
నిర్మల్

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



నిప్పుతో జాగ్రత్త..!
చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. 8లో ▸



మట్టికుండలకు డిమాండ్
మట్టికుండలకు డిమాండ్ పెరుగుతోంది. ఇందులోని నీరు చల్లగా ఉండి దాహం తీర్చడంతోపాటు ఆరోగ్యాన్ని ఇస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.5/27.6
వాతావరణం పొడిగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వేడిగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కడెం: ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను ఈ వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్య రాజేశ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సందీప్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ జెడ్పీటీసీ


జెడ్పీటీసీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

కుంటాల: కుంటాల జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కుంటాలలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సింగిల్ విండో ఉపాధ్యక్షురాలు లావణ్య, సొసైటీ డైరెక్టర్ గోనె గజ్జారాం కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దత్తాత్రి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, దశరథ్, రమణగౌడ్, రజనీకాంత్, సునీల్‌రెడ్డి, పురుషోత్తం, దత్తు, సబ్బిడి గజేందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న నిజామాబాద్ డిపో–1 మేనేజర్ ఆనందం

లోకేశ్వరం: ప్రయాణికులు టీఎస్ ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ డిపో–1 మేనేజర్ ఆనందం అన్నారు. నందిపేట్ నుంచి లోకేశ్వరం వరకు రూట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి నిజామాబాద్ నుంచి నందిపేట్, సీహెచ్ కొండూర్ మీదుగా లోకేశ్వరం వరకు బస్సు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా బస్సుల్లో ప్రయాణించాలని సూచించారు.

ప్రయాణికులు ఎండలో వేచిచూస్తున్న ఈ ప్రాంతం నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్. ఇక్కడ నిత్యం వందల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తారు. అయితే ఇక్కడ నిలువ నీడ కూడా లేదు. కూర్చోవడానికి కుర్చీలు లేవు. మరుగుదొడ్లు, తాగునీటి గురించి పట్టించుకునేవారు లేరు. ఆదాయం వస్తుందని ఆర్టీసీ అనుకుంటోంది. సౌకర్యాలను మాత్రం గాలికి వదిలేసింది. ఇక షెల్టర్లు నిర్మించాల్సిన బల్దియా తమకేమీ సంబంధం లేదన్నట్లు చూస్తోంది. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతున్నారు.. వానకు తడుస్తున్నారు.. చలికి వణుకుతున్నారు.


శివాజీ చౌక్‌లో షెల్టర్ లేక ఎండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నిలువ నీడలేదు!

- బల్దియా పట్టించుకోదు.. ఆర్టీసీ స్పందించదు
- పట్టణాల్లో బస్ షెల్టర్లు కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- మరుగుదొడ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

నిర్మల్‌చైన్‌గేట్: ఎండలు మండుతున్నాయి.. రోడ్డు పైకి వెళ్తే కనీసం నిలబడేందుకు నీడ కూడా కనిపించనిదుస్థితి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, కూలీలు ఇలా చాలామంది బస్సుల కోసం రోడ్లపక్కన నిరీక్షిస్తుండటంతో నరకం కనిపిస్తోంది. నిర్మల్, భైంసా, ఖనాపూర్ పట్టణాల్లోని చాలాప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ, ఆయా మున్సిపాలిటీల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

పట్టణం నుంచే ప్రయాణం...
ప్రయాణాలు చేసే ప్రజలు బస్సుల కోసం నిర్మల్, భైంసా పట్టణాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో చేరుకుంటారు. పొరుగు జిల్లాలు నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్‌తోపాటు పొరుగు రాష్ట్రం మహారాష్ట్రకు కూడా వెళ్లేందుకు ప్రధాన రహదారివెంట తమకు అనుకూలమైన కూడళ్ల వద్ద నిరీక్షిస్తారు. అయితే బస్సులు ఆగే కూడళ్ల వద్ద ఎక్కడా షెల్టర్లు లేవు. దీంతో ఎండలకు ఎండుతూ, వానలకు తడుస్తూ నిరీక్షిస్తున్నారు. ఎండ వేడి తట్టుకోలేక సమీపంలోని దుకాణాల ముందు నిలబడే ప్రయత్నం చేస్తే షాపుల యజమానులు అడ్డు ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక వానొస్తే తడవాల్సిందే. రాత్రి సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రత కూడా లేదు.

బస్ షెల్టర్ లేని ప్రాంతాలు...
నిర్మల్‌లో.. శివాజీచౌక్, ఈద్గామ్ చౌరస్తా, కలెక్టరేట్ ఎదుట, రూరల్‌పోలీస్ స్టేషన్ ఎదుట, అంబేద్కర్ విగ్రహం వద్ద, డాక్టర్స్ లేన్,
భైంసాలో.. శివాజీచౌక్ (నిర్మల్ – బాసర వెళ్లే మార్గం), సుభాష్‌నగర్
ఖానాపూర్‌లో.. విద్యానగర్, బాదన్‌కుర్తి ఆటోఅడ్డా

తాగునీరు.. మరుగుదొడ్లు లేక..
నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌరస్తా నుంచి నిత్యం వందల మంది వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. బస్సులు, ఆటోల కోసం వేచిచూసేవారికి తాగునీరు లేదు. దీంతో దాహం వేస్తే దుకాణాల్లో కొనుక్కోవాల్సిందే. ఎండాకాలం నేపథ్యంలో కనీసం చలివేంద్రం అయినా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇక మరుగుదొడ్లు ఎక్కడా కనిపించవు. అత్యవసరమైతే దూరంగా బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిందే. మహిళలు అయితే ఉగ్గపట్టుకుని ఉండాల్సిన పరిస్థితి. షెల్టర్స్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత పూర్తిగా బల్దియా అధికారులదే అంటున్నారు ఆర్టీసీ అధికారులు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది..
బస్టాండ్ లేకపోవడంతో బస్సులు రోడ్డు పక్కనే ఆపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. రోడ్డు పక్కన ఎక్కువ స్థలం లేకపోవడంతో బస్సులు రోడ్డు మధ్యలోనే నిలుపుతున్నారు. ప్రయాణి కులు ఎక్కి, దిగే వరకు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోంది. ఇక నీడ లేకపోవడంతో బస్సుల కోసం వేచి చూసే ఓపిక లేక చాలామంది ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోతున్నారు. దీంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ తగ్గుతోంది. ఫలితంగా ఆదాయం తగ్గుతోంది.

బస్ షెల్టర్లు నిర్మించాలి...



శివాజీ క్రాస్ రోడ్డు వద్ద నాలుగు ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన సెంటర్లో ప్రయాణికుల సౌకర్యం కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలి. బస్ షెల్టర్లు లేక బస్సు వచ్చే వరకు రోడ్డుపైనే ఎండలో వేచి ఉండాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి. – దశరథ్ పోశెట్టి, నిర్మల్

చలివేంద్రం ఏర్పాటు చేయాలి



వేసవి కాలం దృష్ట్యా ప్ర ధాన కూడళ్లలో అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ, చలివేంద్రం ఏర్పాటు చేయాలి. పలు కూడళ్లలో, బస్ షెల్టర్ల వద్ద తాగునీరు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఎండకు తట్టుకోలేకపోతున్నారు.
– దేవీదాస్, నిర్మల్

సృజనాత్మకతను వెలికితీసేలా వేసవి శిబిరాలు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, హాజరైన అధికారులు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- మే 1 నుంచి ప్రారంభించాలని ఆదేశం

నిర్మల్‌చైన్‌గేట్: పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటుపై డీఈవో, డీఎస్‌వో, సీఈవో, డీపీవో, పేటా అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొదటిసారిగా ఈ వేసవిలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మే 1 నుంచి 31 వరకు నెలరోజులపాటు నిర్వహించే శిబిరాలకు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని సూచించారు. డీఎస్‌వో ద్వారా జిల్లాలో పది అంశాల్లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. శిబిరాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు, వలంటీర్లను నియమించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే సమ్మర్ క్యాంప్‌లలో సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, ఎంపీవో, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో ఏర్పాటు చేసే శిక్షణ శిబిరాలను ఎక్కువ మంది పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. యోగా, మెడిటేషన్, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, మ్యూజిక్, ఆర్ట్ (చిత్రలేఖనం), స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, టెన్నిస్, క్రికెట్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈమేరకు కావాల్సిన మెటీరియల్ కోసం ఈనెల 25లోపు నివేదిక ఇవ్వాలని సూచించారు. శిక్షణ శిబిరాల బాధ్యత పూర్తిగా పీఈటీ, పీడీలదే అని స్పష్టం చేశారు. సమావేశంలో సీఈవో సుధీర్, డీఎస్‌వో శ్రీకాంత్, డీఈవో రవీందర్‌రెడ్డి, పెటా అధికారి రమేశ్, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీ సుదర్శన్

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామ శివారులోని వివాదాస్పద స్థలాన్ని కలెక్టరు ఆదేశాల మేరకు భూముల కొలతల శాఖ ఏడీ సుదర్శన్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని కన్కాపూర్ గ్రామానికి చెందిన కొబ్బనోల్ల పెద్ద గంగన్నకు 33 ఏళ్లుగా 328 సర్వే నంబరులో ఉన్న ఐదెకరాల భూమిని అబ్దుల్లాపూర్ వీడీసీ కబ్జా చేశారని కలెక్టరుకు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. ఈమేరకు జీపీఎస్ ద్వారా సర్వే చేశామని తెలిపారు. నివేదికను కంప్యూటర్‌లో పొందుపర్చి కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట సర్వేయర్ నరేందర్, అబ్దుల్లాపూర్–కన్కాపూర్ గ్రామస్తులు ఉన్నారు.

‘ఉపాధి’ పనులు ఉదయమే చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

పెంబి: ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉపాధి కూలీలు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు పనులు ముగించుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంతోపాటు నాగాపూర్ గ్రామంలో ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండ తీవ్రత పెరుగుతున్నందున ఉదయమే పనులు ముగించుకోవాలని సూచించారు. సర్పంచులు కూలీలకు తాగునీరు అందించాలని పేర్కొన్నారు. ఆమె వెంట టీఏ అంజయ్య, ఎఫ్‌ఏ భూమన్న ఉన్నారు.

ఆయిల్‌పామ్ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- సీనియర్ శాస్త్రవేత్త బీఎన్.రావు

సోన్: ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులు మొక్కల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త బీఎన్.రావు సూచించారు. మండలంలోని పాక్‌పట్లలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కలకు వచ్చే తెగుళ్లు, పోషకాల లోపాలతో వచ్చే తెగుళ్లపై అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం బిందుసేద్యం, యాజమాన్యంపై సీనియర్ కన్సల్టెంట్ అనంత్‌రావు అవగాహన కల్పించారు. తర్వాత రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్త సమాధానాలు ఇచ్చారు.


ఆయిల్‌పామ్ మొక్కలు పరిశీలిస్తున్న బీఎన్.రావు

కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి శ్యామ్‌రావు, సర్పంచ్ గంగారెడ్డి, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు రోహిత్, ప్రణీత్ పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’ సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. బంగల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. మహిళలకు ప్రతీ మంగళవారం అందించే ప్రత్యేక వైద్య సేవలను పరిశీలించారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రారంభ దశలో మందులతో నయం అవుతుందని తెలిపారు. ఓరల్, సర్వేకల్, రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్, అయోడిన్ లోపం, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు తదితర ఎనిమిది రకాల వ్యాధుల నిర్ధారణ, చికిత్స కోసం ఈ ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. తర్వాత యూపీహెచ్‌సీలో మహిళలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో ధనరాజ్ ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాస్వామ్యాన్ని కలుషితం చేస్తున్న ప్రభుత్వాలు

- నాయకత్వం లేని పార్టీలు బీజేపీ, బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పక్కన పార్టీ నాయకులు

నిర్మల్‌టౌన్: రాజకీయాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని కలుషితం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర 13 రాష్ట్రాల మీదుగా 4 వేల కిలోమీటర్ల సాగిందన్నారు. యాత్రకు వచ్చిన స్పందన చూసి ఓర్వలేక రాహుల్ గాంధీ ఎంపీగా అనర్హత వేటు వేశారన్నారు. నాయకత్వం లేని పార్టీలు బీజేపీ, బీఆర్‌ఎస్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులను కోట్లు ఖర్చుపెట్టి కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ సముద్రం లాంటిదని పార్టీ నుంచి ఎందరు వెళ్లిపోయినా నష్టం జరగదని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెళ్లిపోవడంతో కిందిస్థాయి కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. వారం రోజుల్లో నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరికలు ఉంటాయని ప్రకటించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను వదిలేసి పరస్పరం కొట్టుకుంటున్నాయని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కున్న ఎమ్మెల్సీ కవితకు దండలేసి స్వాగతం పలికే పరిస్థితి తెలంగాణలో నెలకొందన్నారు. దొంగలకు సద్దులు కట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారాయన్నారు. అదానీ, అంబానీలను కాపాడడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళితులను మభ్యపెట్టాలని సీఎం కేసీఆర్ దళితబంధును చూపెడుతున్నారని, ఎంతమందికి ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలతో ఆటలాడుకుంటున్న రాష్ట్రంలోని కేడీకి, కేంద్రంలో ఉన్న మోదీకి బుద్ధి చెప్పాలని కోరారు. సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... పదేళ్లుగా బీఆర్‌ఎస్‌లో ఉన్నానని, ఆ పార్టీలో నాయకులు, కార్యకర్తలకు గౌరవం లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గౌరవం లేని పార్టీలో ఉండలేక బయటకు వచ్చానని తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి, ఉద్యమకారులైన శ్రీహరిరావు, సత్యనారాయణగౌడ్‌ను ఎంపిక చేయకుండా ఎన్నారైకి టికెట్ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మల్లేశ్, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎంబడి రాజేశ్వర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దాతలు సాయం చేయాలి

- హోంమంత్రి మహమూద్ అలీ

నిర్మల్ టౌన్: సామాజిక సేవ కార్యక్రమాల కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీ’కి దాతలు సహాయం చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ కోరారు. దాతలు ఇచ్చే నిధులు చెక్కుల రూపంలోనే ఇవ్వాలని సూచించారు. ఇటీవల పెన్నా, అంజని సిమెంట్ లిమిటెడ్ వారు ఇచ్చిన రూ.10 లక్షల చెక్కులను జిల్లా కేంద్రంలోని అటవీశాఖ విశ్రాంతి భవనంలో ఎస్పీ సీహెచ్.ప్రవీణ్‌కుమార్‌కు అందించారు. సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీకి ఇచ్చే నిధులకు ట్యాక్స్ మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ నిధులతో ప్రజలకు ఆరోగ్య శిబిరాలు, ప్రకృతి వైపరీత్యాలతో కలిగే ఇబ్బందుల పరిష్కారం, సామాజిక సేవ కార్యక్రమాలకు వినియోగిస్తామని వివరించారు. అనంతరం ఎస్పీ జిల్లా పోలీసుల తరఫున హోంమంత్రికి అభినందనలు తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి , జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి , భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ పాల్గొన్నారు.

హోం మంత్రికి స్వాగతం
నిర్మల్‌చైన్‌గేట్: నూతనంగా నిర్మించిన ఈద్గాను ప్రారంభించడానికి జిల్లాకు వచ్చిన రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీకి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. స్థానిక ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో కలిసి పూల మొక్క అందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఎస్పీకి చెక్కు అందజేస్తున్న మంత్రులు

హోం మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు బీజేపీ యత్నం


బీజేపీ నాయకులను తరలిస్తున్న పోలీసులు


ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న డీఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా కేంద్రంలోని చించోలి(బి) వద్ద నూతనంగా నిర్మించిన ఈద్గాను ప్రారంభించడానికి మంగళవారం వచ్చిన రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ కాన్వాయ్ అడ్డుకునేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. కలెక్టర్ కార్యాలయం ఎదుట కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు బీజేపీ నాయకులు యత్నించారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. డీఎస్పీ అక్కడ ఉన్న నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ముందస్తు అరెస్టులు..
హోంశాఖ మంత్రి మహమూద్ అలీ జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంటి గేటుకు పోలీసులు తాళం వేశారు.

నేడు వాహనాల వేలం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణంలో ఈనెల 19న వివిధ కేసుల్లో పట్టుబడిన 16 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన వాహన ధరలో 50 శాతం చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలంలో ఆటో –1, మోటార్ సైకిళ్లు–14, మోపెడ్–1 ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

భైంసాటౌన్:పదో తరగతి పూర్తి చేసుకుని టీఎస్ఆర్‌జేసీ, ఎంజేపీ, పాలిసెట్ వంటి ప్రవేశ పరీక్షలు రాజే విద్యార్థులకు ఉచిత శిక్షణ మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని వేదం పాఠశాలలో ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు లక్ష్మణ్ సూచించారు.

క్లుప్తంగా

ఆలయ పనులు పరిశీలన



మార్కింగ్ ఇస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులను మంగళవారం దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈఈ కనక దుర్గాప్రసాద్, డీఈఈ ప్రభాకర్, ఏఈ రామారావు పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి కొన్ని పనులకు మార్కింగ్ చేశారు. పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ జగన్మోహన్‌కు సూచించారు. అనంతరం బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, దేవాలయ అర్చకులు శ్రీనివాస శర్మ ఉన్నారు.

ట్రిపుల్‌ఐటీలో కరోనా పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు కరోనా పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు సిబ్బందికి కరోనా సోకడంతో అప్రమత్తం అయ్యారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 200 మంది విద్యార్థులకు కరోనా పరీక్షలు చేశారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ పర్యావేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ కరోనా సోకినట్లు నిర్ధారణ కాలేదు.

విద్యుత్‌షాక్‌తో పశువులు మృతి



మృతిచెందిన పశువులు

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌తో నాలుగు పశువులు మృత్యువాతపడ్డాయి. స్థానికుల వివరాల ప్రకారం... అక్బర్‌కు చెందిన రెండు ఆవులు, వీరేశ్‌కు చెందిన ఆవు, గేదె గ్రామ సమీపంలోని పంట పొలాల్లో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈ క్రమంలో విద్యుత్ తీగలు మూడు ఆవులు, గేదెపై పడడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

సిర్పూర్(టి): మండలంలోని రెండు అంతర్రాష్ట్ర రహదారుల్లో పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా చౌరస్తా వద్ద, మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలో వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

నిప్పుతో జాగ్రత్త..!

- చిన్నచిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు
- అప్రమత్తతతోనే నివారణ
- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. ప్రమాద స్థలాలకు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని నష్టాన్ని నివారించే అవకాశం చాలా తక్కువే. అందుకే అసలు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు. ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



మాతాశిశు కేంద్రంలోని వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నాసిరకం విద్యుత్ తీగలు..

పట్టణాల్లో జరిగే 30శాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే. దీనికి కారణం నాసిరకం విద్యుత్ తీగలు వాడడమే. తక్కువ ధరకు కొనుగోలు చేసిన నాసిరకం తీగలతో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా జరిగినప్పుడు షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతోంది. తీగలు తెగినప్పుడు కొందరు మధ్యలో అతుకులు వేస్తుంటారు. ఇలా చేయడంతో విద్యుత్ జాయింట్ వేసిన ప్రాంతంలో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా అయినప్పుడు వేడికి కరిగిపోయి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపిస్తాయి. తరుచుగా విద్యుత్ తీగలు మార్చుకోవడంతో ప్రమాదాలు నివారించవచ్చు.

అందుబాటులో అగ్నిమాపక పరికరాలు..

అగ్ని ప్రమాదాలు నిరోధించేందుకు అనేక పరికరాలు అందుబాటులో ఉంచాలి. పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్యపరమైన స్థలాలు, హోటళ్లు, బార్లు, సినిమా థియేటర్లు, కళ్యాణ మండపాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, లాడ్జీలు తదితర ప్రదేశాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. తక్కువ ధరలోనే లభించే ఈ పరికరాలు ఇళ్లలో సైతం ఏర్పాటు చేసుకుంటే మంచిది.

వంటగదిలో జాగ్రత్తలు....

సాధారణంగా ఇళ్లలో వంటగ్యాస్ లీకేజీతోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఐఎస్ఐ మార్క్ లేని నాసి రకం పైపు, నిర్దేశిత రెగ్యూలేటర్ వాడకపోవడం కారణం. ముఖ్యంగా వంటగదికి కిటికీలు, వెంటిలేటర్లు ఉండాలి. గ్యాస్ లీకేజీ ఏర్పడినా బయటకు వెళ్లిపోతుంది. అలాగే గడ్డికుప్పలు, పత్తి, పత్తి కర్ర కుప్పలకు త్వరగా మంటలు వ్యాపిస్తాయి. జాగ్రత్తలు తీసుకుంటే మేలు.

జిల్లాలో మూడేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు...

సంవత్సరం	అగ్ని ప్రమాదాలు	ఆస్తినష్టం రూ.లలో
2020–2021	184	రూ.2కోట్లు
2021–2022	124	రూ.88లక్షలు
2022– డిసెంబర్	152	రూ.కోటి 10లక్షలు

జిల్లాలోని ఫైర్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు....

అగ్నిమాపక కేంద్రం	అధికారి సెల్ నం.	ఫైర్‌స్టేషన్ ల్యాండ్/మొబైల్ నంబర్
మంచిర్యాల	8712699195	08736 252101/87126 99194
బెల్లంపల్లి	8712699199	08735 225101/87126 99198
జన్నారం	8712699197	08739 245101/87126 99196
చెన్నూర్	8712699201	08737 242101/8712699200

నివారణకు వినియోగించాల్సినవి...

- సోడా, యాసిడ్, నీటి కార్బన్‌డయాక్సైడ్ మిశ్రమాన్ని విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలకు తప్ప మరే అగ్ని ప్రమాదాలకైనా వాడోచ్చు. ఇందుకు సంబంధించిన రసాయన మిశ్రమాలు నింపిన పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- పెట్రోల్, డీజిల్, ఆయిల్, గ్రీజ్ తదితర చమురు పదార్థాలు కాలుతున్నప్పుడు నీటిని పోయకూడదు. నీరు ఎక్కువగా బరువు ఉంటుంది. అందుకే నీరు మంటల కిందికి వెళ్తుంది. కానీ మంటలను ఆర్పివేయదు. అల్యూమీనియం సల్ఫేట్, సోడియం బైకార్బోనైట్ మిశ్రమం గల నురుగు గల పరికరాన్ని ఉపయోగించాలి.
- విద్యుత్‌తో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు గ్యాస్‌లాగా ఉండే కార్బన్ డయాక్సైడ్ గ్యాస్ పరికరాన్ని వాడాలి.

నిర్లక్ష్యంతోనే అగ్ని ప్రమాదాలు



చిన్నపాటి నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ శుక్రవారం ఏదైన ఓ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చు.- అజయ్‌బాబు, జిల్లా ఫైర్ అధికారి, మంచిర్యాల

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



జాడి తిరుపతి(ఫైల్)

దస్తురాబాద్: ప్రేమించిన అమ్మాయి కాదనడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని బుట్టపూర్ గ్రామానికి చెందిన జాడి తిరుపతి(20) ప్రేమించిన అమ్మాయి కాదనడంతో మనస్తాపానికి గురై ఈ నెల 15న రాత్రి ఇంట్లోని గడ్డిమందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. తండ్రి జాడి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



చరణ్‌కుమార్ మృతదేహం

నిర్మల్‌టౌన్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని బోయివాడకు చెందిన జేష్టం చరణ్‌కుమార్ (28) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన చరణ్ మంగళవారం ఉదయం అదే కాలనీ సమీపంలోని పెట్రోల్ పంపు ఎదుట మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ మల్లేష్ చేరుకుని పరిశీలించారు. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మొక్కజొన్న దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు నాగరాజు రవి, నాగరాజు రాజు రబీ సాగులో మూడు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. కోత దశలోని సమయంలో పొలంలోని ఎల్టీ విద్యుత్ లైన్ తీగలు గాలికి స్పార్క్ కావడంతో నిప్పురవ్వలు మొక్కజొన్న పంటలో పడడంతో పంట మొత్తం దగ్ధమైంది. రూ.3లక్షల వరకు నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది

సిరికొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. చిమ్మన్‌గూడి గ్రామంలో 100 లీటర్ల బెల్లం పానకం, చిమ్మన్‌గూడి గ్రామ చౌరస్తాలో మూడు లీటర్ల గుడుంబా, బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ సీఐ రాజమౌళి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ కుమార్, ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేష్, దేవందర్, వి.సంధ్య, మహ్మద్, కె.మంజుల ఉన్నారు.

ఉన్నత విద్యకు వసతులు మెరుగు

ఉట్నూర్: ఉన్నత విద్యను అభ్యసించే గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యూనివర్సిటీల్లో ఉంటూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాల ఏర్పాటు కోసం గిరిజన సంక్షేమ శాఖ చర్యలు తీసుకోనుంది. ఆయా యూనివర్సిటీల్లో బాల బాలికలకు ప్రత్యేకంగా వసతి గృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

ఉమ్మడి జిల్లాలో....

ఉమ్మడి జిల్లా ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థులు పదో తరగతి ఆపై డిగ్రీ పూర్తి కాగానే ఉన్నత విద్య కోసం యూనివర్సిటీల బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.95 లక్షల గిరిజనులుండగా గిరిజన విద్యాభివృద్ధి కోసం గిరిజన సంక్షేమ శాఖ అధీనంలో 133 ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాలు ఆధ్వర్యంలో 28 వరకు గురుకులాలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో ప్రతి విద్యా సంవత్సరంలో 47 వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే డిగ్రీ వరకు విద్య పూర్తి కాగానే విద్యార్థులు పై చదువుల కోసం యూనివర్సిటీల బాట పట్టాల్సి వస్తోంది. అయితే ఆయా యూనివర్సిటీలలో గిరిజన విద్యార్థులకు పరిమిత సంఖ్యలో సీట్లు ఉండడంతో పాటు రిజర్వేషన్ల ప్రకారం గిరిజన విద్యార్థులకు తక్కువ సంఖ్యలో సీట్లు ఉండడంతో గిరిజన విద్యార్థులకు నష్టం జరుగుతోంది. దీంతో అధిక శాతం గిరిజన విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఉన్నత విద్యను మధ్యలోనే నిలిపివేస్తున్నారు.

ప్రత్యేక వసతి గృహాల ఏర్పాటు...

రాష్ట్రంలో పది యూనివర్సిటీలు, మూడు సెంట్రల్ యునివర్సిటీలు, ఒకటి టెక్నాలజికల్ యూనివర్సిటీ ఉంది. ఉమ్మడి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య కోసం యూనివర్సిటీలకు వెళ్తున్నారు. వీరికి మెరుగైన ఉన్నత విద్య అవకాశాలు కల్పించడంతో పాటు ఉచిత వసతి సౌకర్యాల కోసం ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీల్లో బాల బాలికలకు వేర్వేరుగా ఒక్కో యూనివర్సిటీల్లో రెండు వసతి గృహాల నిర్మాణం చొప్పున 14 వసతి గృహ భవనాలు నిర్మిస్తోంది. ప్రతి వసతి గృహ నిర్మాణానికి రూ.5కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.



నోరూరిస్తున్న తాటి ముంజలు

వేసవిలో మనకు చల్లదనం ఇచ్చేందుకు ప్రకృతి ప్రసాదించిన వాటిలో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. వీటిని వయసుతో సంబంధం లేకుండా అందరూ అమితంగా ఇష్టపడతారు. ఇవి స్వచ్ఛమైనవి. మండుటెండల నుంచి ఉపశమనం కల్పిస్తాయి. శరీరాన్ని చల్లబరుస్తాయి. ఆరోగ్య ప్రదమైన తాటి ముంజలను చుట్టు పక్కల గ్రామాల నుంచి తీసుకువచ్చి పట్టణాల్లోనూ విక్రయిస్తున్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నోరూరిస్తున్న తాటి ముంజలను జనం ఎగబడి కొంటున్నారు. రూ.100కు డజన్ ముంజలు విక్రయిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ రహదారిపై పిప్రికాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బాబుల్‌గాంకు చెందిన గంగాధర్ బైక్‌పై భైంసా నుంచి వెళ్తుండగా కూడలి వద్ద మహీంద్ర సుప్రో వాహనం ఢీకొని కిందపడ్డాడు. దీంతో గంగాధర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో ఏరియాస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో యువతి మృతి



పరమేశ్వరి మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన పరమేశ్వరి(17) మంగళవారం వడదెబ్బతో చనిపోయింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంతోష్, లలిత దంపతుల కూతురు పరమేశ్వరి సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లి వచ్చి కళ్లు తిరుగుతున్నాయని పడిపోయింది. ప్రాణాలు కోల్పోయింది. తీవ్రమైన ఎండలో వెళ్లడం వల్లే వడదెబ్బ తగిలి చనిపోయిందని కుటుంబ సభ్యులుత ఎలిపారు. సర్పంచ్ సరితాశ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఫోన్‌పోతే బాధ అవసరం లేదు

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోయిందని బాధ పడనక్కర్లేదని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఈ వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. దొంగతనం లేదా పోయిన మొబైల్‌ని తిరిగి పొందడానికి సీఈఐఆర్ అనే వెబ్‌సైట్ ఉపయోగాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి అన్నీ పోలీస్‌స్టేషన్లలోని అధికారులకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్ హాండ్ ఫోన్‌లు కొనే ముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలన్నారు. దొంగతనానికి లేదా ఫోన్‌లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు. సుమారుగా 250 మొబైల్ ఫోన్స్ బాధితులకు పట్టించినట్లు వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అప్లికేషన్ ఫోన్ వెతికి పెట్టడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ అప్లికేషన్‌పై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీనిపై సందేహాలు ఉంటే రవికుమార్, నిర్మల్ జిల్లా సైబర్ ల్యాబ్ ఇన్‌చార్జ్ నెంబర్ 8712659567 కి సంప్రదించవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే పోడుహక్కుల చట్టం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్
- ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నాయకులు

ఖానాపూర్: గిరిజనుల కోసం పోడుహక్కుల చట్టం తెచ్చి లక్షలాది మందికి అటవి హక్కు పత్రాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్లో పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్ అధ్యక్షతన జరిగిన పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పోడుహక్కుల చట్టం తెచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికీ హక్కు పత్రాలు ఇవ్వలేని దుస్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఏలేటికి అధిష్టానం జాతీయ స్థాయిలో పదవి కట్టబెట్టి రాజులా గుర్తించిందన్నారు. బీజేపీలో నేడు బానిసలా ఉండే దుస్థితి రాబోతుందన్నారు. కేసీఆర్ పాలనలో లిక్కర్ స్కాంలు, లీకేజీలు తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్‌తో ఎటువంటి పోత్తులు ఉండబోవని రాహుల్‌గాంధే స్పష్టం చేశారన్నారు. నిరుద్యోగ సమస్యపై సరూర్‌నగర్‌లో మేలో జరిగే భారీ సభకు ప్రియాంకగాంధీ హాజరవుతారన్నారు. ఎంతమంది నాయకులు కాంగ్రెస్‌ను వీడినా కార్యకర్తలంతా పార్టీ వెంటే నడుస్తారని తెలిపారు. అనంతరం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు మాట్లాడుతూ పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఎర్రవత్తి అనిల్, జెడ్పీటీసీ పోరం జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సత్తు మల్లేశ్, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆనంద్‌రావు, ఎంబడి రాజేశ్వర్, దుర్గ భవాని, చిన్నం సత్యం, యూసుఫ్‌ఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, తోట సత్యం, కడార్ల గంగనర్సయ్య, జహీర్ హైమద్, అబ్బుబై, తిరుపతిగౌడ్, రాజునాయక్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నర్సాపూర్(జి): మండలంలోని డొంగుర్గాం సుద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఎటువంటి అనుమతి పత్రాలు (రశీదులు)లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు తహసీల్దార్ శ్రీకాంత్ జరిమానా విధించారు. ట్రాక్టర్‌కు రూ.800 చెల్లించి రశీదు తీసుకొని ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల లోపే ఇసుక రవాణా జరిగేలా చూడాలని ఇటీవల కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కానీ అందుకు పరిస్థితి భిన్నంగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ఇసుకాసురులు ధనార్జనే ధ్యేయంగా రాత్రి వేళల్లో సైతం సుద్దవాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

శివాలయంలో చోరీ



హుండీని పగులకొట్టే ప్రయత్నం చేస్తున్న దుండగులు (సీసీ కెమెరాలోని దృశ్యం)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లోని శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని రెండు హుండీలను పగులకొట్టిన దుండగులు అందులోని నగదును ఎత్తుకెళ్లారు. 15 రోజుల క్రితం హుండీని లెక్కించారు. అప్పటి నుంచి హుండీకి తాళం వేసి ఉంది. మంగళవారం ఉదయం ఆలయ పూజారి ఉదయం వచ్చి చూడగా హుండీని పగులకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. చోరీకి పాల్పడిన దృశ్యాలు కెమెరాలో నిక్షిప్తమయ్యాయని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీలోని జోన్ 2లో నివాసముంటున్న జిల్లా దళితాభివృద్ధి అధికారి సునీతా కుమారి ఇంట్లో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు తాళాలను పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఈ మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బతుకుచిత్రం



మురికి కాలువ పక్కన కూర్చుని తింటున్న చిన్నారులు

ఇచ్చోడ: దేశంలో ఓ వైపు సంపన్నులు పెరుగుతున్నప్పటికీ మరో వైపు నిరుపేదలు మరింత నిరుపేదలుగా మారుతూనే ఉన్నారు. ఒకపూట కడుపు నింపుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆడుతూ పాడుతూ గడపాల్సిన చిన్నారులు చేతిలో గిన్నె పంటుకుని అన్నం కోసం ఇంటింటికీ తిరుగుతున్నారు. ఓ తల్లి పెట్టిన పట్టెడు మెతుకులను ఓ మురుగు కాల్వ పక్కన కూర్చుని తింటున్న గుండెలు కదిలించే దృశ్యం మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో సాక్షికి చిక్కింది.